క్లుప్తంగా

అరుణాచలం, శ్రీశైలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు


కావలి డీఎం శ్రీనివాసులు

కావలి: అరుణాచలం, శ్రీశైలంతో పాటు ఇతర పుణ్యక్షేత్రాలను దర్శించుకునే భక్తులు, యాత్రికులకు ఆర్టీసీ అనేక సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు సోమవారం తెలిపారు. అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తులకు కేవలం రూ.1,400 చార్జీతో రాను, పోను అవకాశం కల్పిస్తున్నామన్నారు. జూన్ 3న అరుణాచలం గిరిప్రదక్షిణకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని, టికెట్ రిజర్వేషన్ చేయించుకోచ్చన్నారు. శ్రీశైలం టికెట్ రిజర్వేషన్ చేయించుకునే వారికి, తిరుమల తరహాలో దర్శనం టికెట్ కూడా అందజేస్తామన్నారు. ప్రయాణికుల కోరితే ప్రత్యేక ప్యాకేజీలో తీర్థ యాత్రలకు ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేస్తామని వివరించారు.

గర్భిణులకు మజ్జిగ పంపిణీ


గర్భిణులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్

ఆత్మకూరు: ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు వచ్చే గర్భిణులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం తన సొంత నగదుతో మజ్జిగ ప్యాకెట్లు, వేరుశనగ చిక్కీలు అందజేశారు. చల్లటి తాగునీటిని ఏర్పాటు చేశారు. గర్భిణులు ప్రతి సోమవారం వైద్య పరీక్షల కోసం అధిక సంఖ్యలో వస్తుంటారు. వేసవి కావడంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు డాక్టర్ శేషారత్నం తెలిపారు. వైద్య పరీక్షలు త్వరగా పూర్తయ్యేందుకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్ఎంఓ డాక్టర్ మునికృష్ణ, ఏఓ డాక్టర్ సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి


మాట్లాడుతున్న తహసీల్దార్

చేజర్ల (సోమశిల): రెవెన్యూకు సంబంధించి సమస్యలను సకాలంలో పూర్తి చేయాలని అనంతసాగరం మండల ఇన్చార్జి తహసీల్దార్ ప్రదీప్ అన్నారు. సోమవారం కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పెండింగ్ సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. త్వరలో ఆమని చిరువెళ్లలో జరుగుతున్న రీ సర్వేపై దృష్టి పెట్టాలని సూచించారు. 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమంపై వచ్చిన సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఆస్పత్రి నిర్మాణ పనుల తనిఖీ


తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది

జలదంకి: మండలంలోని గట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి నిర్మాణ పనులను నెల్లూరుకు చెందిన క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి భవన నిర్మాణ పనులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా? లేదా అని క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది హనీఫ్, బాషా తనిఖీ చేశారు. భవన నిర్మాణ శ్లాబు, కాంక్రీట్ పనులు సక్రమంగా జరుగుతున్నట్లు గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు.

స్పందన వినతులకు సత్వర పరిష్కారం


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు లక్ష్మీ నరసింహం

ఆత్మకూరురూరల్: స్పందనలో ప్రజల నుంచి అందిన వినతులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు లక్ష్మీ నరసింహం అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సర్వే సమస్యలు, భూ రికార్డుల్లో ఆన్‌లైన్ సవరణలు, ఆస్తి వివాదాలు తదితర అంశాలకు సంబంధించి వచ్చిన అర్జీలపై ఆయా గ్రామాల వీఆర్ఓలతో క్షేత్రస్థాయి విచారణ చేయించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మేనిఫెస్టోను అమలు చేసిన ఘనత జగనన్నదే

- చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ప్రజలకు చేసిన మేలు చెప్పగలరా?
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

సంగం: దేశంలోనే ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పడమటిపాళెం, ఎస్‌వీఆర్ పురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని గ్రామస్తులకు అడిగారు. అధికారులు ప్రతి సమస్యను నమోదు చేసి పరిష్కరించేలా చూస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను పవిత్రంగా భావించి, నాలుగేళ్లుగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించారన్నారు. గతంలో చంద్రబాబు 14 ఏళ్ల పాటు పాలన చేసినా ఏ గ్రామంలో ఇంతటి అభివృద్ధి చేయలేదన్నారు. మేనిఫెస్టోను తుంగలో తొక్కేసి, దాచేసిన చరిత్ర అని టీడీపీదని విమర్శించారు.

సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం

పడమటిపాళెంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం, సచివాలయ భవనాలను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. అంతకు ముందు పడమటిపాళెం గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతుందని, రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటును మేనిఫెస్టోలో పొందుపరిచి అన్ని పనులు చేపడుతామని వివరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా భావించి పాలన అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రావుల లక్ష్మీప్రసాద్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గంగపట్నం శేఖరయ్య, దేవసహాయం, మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, పార్టీ నేతలు కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి, ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, గుండాల బాల చంద్రారెడ్డి, సూరి మదన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు మానికల చందన్ కుమార్, ఆనం ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోల్పోతున్న టీడీపీ


కలిగిరి నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మెట్టుకూరు చిరంజీవిరెడ్డి

ఉదయగిరి/ కలిగిరి: రాష్ట్రంలో టీడీపీ ఉనికి కోల్పోతుండడంతో దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తుందని ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి తెలిపారు. పేదలకి పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధానికి సంఘీభావంగా కలిగిరి మండలం 14వ మైలు సెంటర్ నుంచి ఉదయగిరి వరకు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వింజమూరు, దుత్తలూరు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. ఉదయగిరిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పార్టీలో కష్టపడి అంకితభావంతో పనిచేసే సామాన్య కార్యకర్తలను గుర్తించి ఉన్నత స్థాయి పదవుల్లో కూర్చో బెట్టిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంద్రా బాలగురవారెడ్డి, పాలవల్లి మాలకొండారెడ్డి, రవిరెడ్డి, పల్లాల కొండారెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, కాలేషా, కామేపల్లి వెంకటరత్నం, ముర్తిజా హుస్సేన్, మట్ల శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో నూతన బోరు ఏర్పాటు


తూర్పువీధిలో నూతన బోరు వేయిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని 7వ వార్డు తూర్పువీధిలో సోమవారం నూతన బోరు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానికులు బోరు ఏర్పాటు చేయాలని కోరారు. సచివాలయం నిధుల ద్వారా నూతన బోరుకు అనుమతులు మంజూరు చేయించారు. దీంతో కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్ బేగం బోరు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పోలింగ్ బూత్ ఇన్‌చార్జి సయ్యద్ జమీర్, తదితరులు పాల్గొన్నారు.

జెక్కా వెంకయ్యకు నివాళి


జెక్కా వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడులోని సుందరయ్య భవన్‌లో సోమవారం సీపీఎం నేత జెక్కా వెంకయ్య ఐదో వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి మూలి వెంగయ్య, మండల కార్యదర్శి రంతుల్లా, సీఐటీయూ కార్యదర్శి రత్నయ్య తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ జెక్కా వెంకయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు మూలి ప్రమీల, ప్రజా సంఘాల నాయకులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రమణరావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ అన్నదాత వెంకటరమణరావు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట తహసీల్దార్‌గా ఏవీ రమణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న తహసీల్దారు సుభద్రను ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో అనంతసాగరంలో పని చేస్తున్న తహసీల్దారు ఏవీ రమణరావును ఏఎస్‌పేటకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. తహసీల్దార్ సుభద్రను రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతిష్ట మహోత్సవాలు


గణపతి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం ఉప్పలపాడులో శ్రీగణపతి లక్ష్మీనరసింహస్వామి నూతన దేవాలయంలో సోమవారం సాయంత్రం నుంచి ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 30న అంకురార్పణ, జలాదివాసం, అగ్నిప్రతిష్ట దీక్షాహోమం, 31న ప్రాతఃకాల పూజ, జప పారాయణలు, యంత్రములకు అభిషేకం, జూన్ 1న పంచామృత మహా అభిషేకాలు, ధాన్యాది వాసం, లక్ష్మీనరసింహుడి కల్యాణం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి నూతన ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతి ప్రార్థన, గణపతి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఊరుబిండి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి


ఎంఈఓను సన్మానిస్తున్న విద్యార్థులు

చేజర్ల (సోమశిల): విద్యార్థులు పఠనం, ఆలోచన శక్తితో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని అనంతసాగరం ఎంఈఓ బాలకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనంతసాగరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఎంఈఓ బాలకృష్ణారెడ్డిని విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం సచివాలయం-1 సంక్షేమ, విద్య అసిస్టెంట్ బి మురళి, లైబ్రేరియన్ నారాయణరావు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణపై అవగాహన ఉండాలి

- ఎంవీఐ సుందర్‌రావు


వాహనదారులకు కాలుష్య నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సుందర్‌రావు

కావలిరూరల్: వాతావరణం కాలుష్యంతో అనేక అంతు చిక్కని వ్యాధులు ప్రబలుతూ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాలుష్య నియంత్రణకు వాహనదారులు, ప్రజలు అవగాహనతో సహకరించాలని కావలి ఎంవీఐ సుందర్‌రావు తెలిపారు. పట్టణంలో కాలుష్య నివారణపై సోమవారం వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కావలి పట్టణ, పరిసర ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి కాలుష్య నివారణపై విస్తృతంగా అవగాహన కల్పించారు. వాహనం నుంచి వచ్చే కాలుష్యం పీలిస్తే మెదడు, లివర్, ఊపిరితిత్తులు, నాడీ, గుండెజబ్బులు పలు రకాల వ్యాధులకు మానవులతో పాటు జీవకోటికి ముప్పు ఏర్పడుతుందన్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో ఎక్కువ పొగ వచ్చే వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారుడు ప్రయాణించేటప్పుడు సిగ్నల్ పడిన సమయంలో ఇంజిన్ ఆఫ్ చేయాలని తెలిపారు. ఇంజిన్‌ను ఆఫ్ చేయడం వల్ల కొద్దిపాటి కాలుష్యాన్ని నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కార్యాలయ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

జలదంకి: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మారెళ్ల బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం బ్రాహ్మణక్రాకలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిది వసంతాల ప్రజారంజక పాలన, బూత్ స్వశక్తికరణ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించారన్నారు. మే 30 నుంచి జూన్ 30 తేదీ వరకు నిర్వహించబోయే కార్యక్రమాలపై చర్చించారు. బీజేపీ నాయకులు బండారు తిరుపతిరెడ్డి, చల్లా హనుమారెడ్డి, వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, కంచర్ల శరత్‌బాబు, వంటేరు రాకేష్‌రెడ్డి, పచ్చారి రాము, శివారెడ్డి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా అందజేత

జలదంకి: జలదంకి పంచాయతీ గమళ్లపాళెంకు చెందిన మోర్ల మరియాగౌడ్ ఇటీవల చనిపోవడంతో, అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేలు సచివాలయాల మండల కన్వీనరు తిప్పారెడ్డి ఇందిరమ్మ సోమ వారం అందించారు. త్వరలో మృతుడి కుటుంబానికి రూ.90 వేలు ఖాతాలో జమవుతాయ న్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో చొరవ చూపండి

- బ్యాంకర్లతో కమిషనర్ సమావేశం

ఆత్మకూరు: పొదుపు మహిళలకు రుణాలు మంజూరు చేయడంలో బ్యాంక్ అధికారులు చొరవ చూపాలని, మెప్మా సిబ్బంది రుణాల రికవరీ వేగవంతమయ్యేలా చూడాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు కోరారు. కమిషనర్ చాంబర్‌లో సోమవారం రాత్రి బ్యాంకర్లు, మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పొదుపు రుణాల మంజూరు విషయంలో బ్యాంకు అధికారుల ప్రోత్సాహం బాగుందని ఇటీవల ఏర్పడిన గ్రూపుల పరిస్థితులను పరిశీలించి మెప్మా ఆర్పీలు చెప్పే ఫీడ్‌బ్యాక్ మేరకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లు, మెప్మా అధికారులు అంకయ్య, మాధవి, అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు ప్రతి ఒక్కరి అండ

- వైఎస్సార్‌సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న పార్టీ నాయకులు

ఆత్మకూరు: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి 2024లో అధికారంలోకి రావడానికి ప్రజలందరూ అండగా ఉంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. అమరావతిలో ఇళ్ల పట్టాల పంపిణీపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా, జగనన్న పరిపాలన నాలుగేళ్ల విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో సోమవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పోలీస్‌స్టేషన్, ఎల్ఆర్‌పల్లి, జేఆర్‌పేట, బీఎస్సార్ సెంటర్, మెయిన్ బజార్, సత్రం సెంటర్, హిల్ రోడ్డుల మీదుగా తిరిగి బీఎస్సార్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ జరిగిన సభలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఎస్సీ సెల్ నాయకుడు కొండా వెంకటేశ్వర్లు మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకునే చంద్రబాబు అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే అన్ని వర్గాల ప్రజలు తెలుగుదేశాన్ని ఇక మర్చిపోతారనే అభద్రతా భావంతో ఇష్టారీతిలో మాట్లాడారని దుయ్యబట్టారు. ఇదే టీడీపీ పాలిట శాపంగా మారి పూర్తిగా కనుమరుగు అవుతుందన్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకే ప్రజలు మద్దతు ఇస్తూ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తారన్నారు. సుమారు 300 బైక్‌లకు పైగా ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, నోటి వినయ్ కుమార్‌రెడ్డి, బాల అంకయ్య, షేక్ రహీం, కలాం, ముజీబ్, సయ్యద్ జమీర్, ఎస్ ప్రతాప్ మున్సిపల్ కౌన్సిలర్లు కామాక్షయ్య నాయుడు, పెంచలయ్య అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై ఆదరణ ఓర్వలేక దుర్భాషలు


ఉదయగిరిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నియోజకవర్గ పరిశీలకుడు ధనుంజయరెడ్డి

ఉదయగిరి/కలిగిరి: ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు దుర్భాషలు చేస్తున్నారని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయ్‌రెడ్డి మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను టీడీపీ నాయకులు శ్మశానాలతో పోల్చడాన్ని నిరసిస్తూ కలిగిరి నుంచి ఉదయగిరి వరకు సోమవారం 1,500 బైక్‌లతో భారీ ర్యాలీ చేపట్టారు. కలిగిరిలోని జిర్రావారిపాళెం తిప్ప వద్ద ఉన్న అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి బైకు ర్యాలీ ప్రారంభించారు. కలిగిరిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ ఉదయగిరికి చేరుకుంది. మార్గమధ్యలో వింజమూరు, దుత్తలూరు సెంటర్లలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయరెడ్డికి ఘన స్వాగతం పలికి ర్యాలీలో భాగస్వాములయ్యారు. ఉదయగిరిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధనుంజయరెడ్డి మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నే దక్కుతుందన్నారు. టీడీపీ నాయకులకు మనుగడ ప్రశ్నార్థకంగా మారడంతో ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. 2024లో ప్రజలు మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు కాటం రవీంద్రారెడ్డి, వాసుపల్లి వెంకటేశ్వరరెడ్డి, రేవూరి శ్రీనివాసులురెడ్డి, కర్తం శ్రీనివాసులురెడ్డి, పీసీ అల్లూరురాజు, దుగ్గిరెడ్డి గురవారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ అస్మా

ఆత్మకూరు: కౌమార బాలికలు తమ వ్యక్తిగత ఆరోగ్యం, శారీరక మార్పులపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఆత్మకూరు సీహెచ్‌సీ కేంద్రం వైద్యురాలు డాక్టర్ అస్మా తెలిపారు. అంతర్జాతీయ రుతుస్రావ పరిశుభ్రతపై మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ హాలులో సోమవారం కమిషనర్ బి.నాగేశ్వరరావు, పట్టణ మహిళా సమాఖ్య (మెప్మా) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అస్మా మాట్లాడుతూ నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లులు తమ ఆడపిల్లలకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, మెప్మా సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, మెప్మా సీఎంఎం వి.అంకయ్య, టీఎంసీలు, మాధవి, అలీబేగ్, ఆర్పీలు, డ్వాక్రా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ


సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ సాధు కరుణకుమారి

ఆత్మకూరు: పట్టణంలోని అరుంధతీయవాడ సచివాలయాన్ని ఆర్డీఓ సాధు కరుణకుమారి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించి నమోదైన రికార్డులను పరిశీలించారు. తప్పనిసరిగా సచివాలయాల్లో సమయపాలన పాటించాలని ఆమె సూచించారు. స్పందనలో అందిన అర్జీలను తక్షణమే పరిష్కరించేలా చూడాలని, లేని పక్షంలో ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వలంటీర్ల హాజరు శాతం తక్కువగా ఉందని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా రోజు సచివాలయానికి హాజరయ్యేలా చూడాలని అడ్మిన్‌ను ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ


సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

అల్లూరు: మండలంలోని బీరంగుంట సచివాలయాన్ని ఎంపీడీఓ శ్రీదేవి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులను, సంక్షేమ పథకాల పోస్టర్లను, అర్హుల జాబితాలను తదితర అంశాలపై ఆరా తీశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా సచివాలయ సిబ్బంది పని చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి హజరత్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు మందుల పిచికారీ


మందులు పిచికారీ చేయిస్తున్న వైద్యాధికారి

అనుమసముద్రంపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఏఎస్‌పేట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మంజుల అన్నారు. సోమవారం కస్తూర్బా గాంధీ పాఠశాల, గండువారిపల్లి ప్రాంతాల్లో దోమల నివారణకు మందులను పిచికారీ చేయించారు. ఆమె మాట్లాడుతూ దోమలను నివారించడంలో స్థానికులు కూడా భాగస్వాములు కావాలని తెలిపారు. ఇంటి చుట్టు పక్కల ప్రాంతాల్లో పారిశుధ్యం, పరిశుభ్రత పాటిస్తే దోమలు నివారించవచ్చునని తెలిపారు. ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఆమె వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

కుర్రపల్లి పాఠశాలను పునరుద్ధరించాలి



ఉదయగిరి: మండలంలోని కుర్రపల్లిలో రెండేళ్ల క్రితం రేషనలైజేషన్ కింద మూసివేసిన పాఠశాలను తిరిగి పునఃప్రారంభించాలని జిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ఏ ఏడుకొండలు డీఈఓ గంగాభవానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ పాఠశాల పునః ప్రారంభించాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఇదే తరహాలో మూసివేసిన మరో రెండు పాఠశాలలను పునఃప్రారంభించాలని ఆదేశాలు వచ్చినప్పటికీ కుర్రపల్లి పాఠశాల ప్రస్తావన లేదన్నారు. డీఈఓ వెంటనే తగు చర్యలు తీసుకొని పాఠశాలను పునఃప్రారంభించాలని కోరారు.